క్లుప్తంగా

అడ్మిషన్లు నిలిపివేయండి



మాట్లాడుతున్న యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జగన్

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలం రామంతాపూర్ శివారులోని ఓ ప్రైవేట్ పాఠశాలకు అనుమతులు లేకున్నా 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ప్రారంభించారని యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జగన్ అన్నారు. మంగళవారం పాఠశాల సందర్శించిన సమయంలో పాఠశాలలో అడ్మిషన్లు నిర్వహిస్తుండడంపై పాఠశాల సిబ్బందిని నిలదీశారు. ఈ విషయమై డీఈఓకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా కలెక్టర్ చొరవ చూపాలని కోరారు.

పరిశ్రమ నిర్మాణ పనుల అడ్డగింత



పరిశ్రమ గేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేటలో నూతనంగా నిర్మిస్తున్న ఎంఎస్ స్పాంజ్ పరిశ్రమ పనులను గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. చందంపేట గ్రామంలో నూతన కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గ్రామసభలో డీఎల్‌పీఓ సురేష్‌బాబుకు ఏకగ్రీవ తీర్మాన పత్రం అందించినట్లు తెలిపారు. అయినప్పటికీ కంపెనీ నిర్మాణ పనులను మొదలు పెట్టడంపై గ్రామస్తుల నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో పరిశ్రమ ఏర్పాటును విరమించుకోవాలని గ్రామస్తులు కోరారు.

సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ

మెదక్ కలెక్టరేట్: అసంఘటిత రంగ కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆ నిధులను వారి సంక్షేమానికి వినియోగించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవల్ కిషన్ భవన్‌లో మంగళవారం ఆమె మాట్లాడుతూ...సమాజంలో అత్యంత కీలకమైన పాత్ర పోషించే కూలీలు, హమాలీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 20 నుంచి 70 ఏళ్ల వరకు హమాలీలు పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. హమాలీలు అనేక బరువులు మోస్తూ తొందరగా అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని కూలీ డబ్బులతో కుటుంబాలను పోషిస్తున్నారు. కరోనాసమయంలో ప్రధాని మోదీ కార్మికులందరికీ మోటార్ సైకిళ్లు ఇస్తానని హామీనిచ్చి మర్చి పోయారని విమర్శించారు. మే డే స్ఫూర్తితో భవిష్యత్‌లో ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు.

మెగా హెల్త్ క్యాంపు

రామాయంపేట(మెదక్): రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కాట్రియాల గ్రామంలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఆస్పత్రి డాక్టర్లు క్యాంపులో పాల్గొని రోగులకు వైద్య సేవలు అందజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించారు. 200 మందికి పైగా రోగులు పాల్గొని వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాదగిరి, సుందర్ సింగ్, గంగాధర్, మాజీ సర్పంచ్ శ్యాములు, బీఆర్ఎస్ నాయకులు శ్యాంరెడ్డి, రాజు, సొసైటీ సభ్యులు చంద్రబోస్, సత్యం, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

టేక్మాల్ (మెదక్): టేక్మాల్ మండలంలోని బొడ్మట్పల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అవాహిక దేవతల అర్చన స్థాపిత, దేవతల ప్రతిష్టాంగ హవనములు, దాన్యాధివాసం, షేయ్యాదివాసం, పుష్పాదివాసం, ఫలాదివాసం వంటి ప్రత్యేక పూజలతో పాటు హోమం నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అదుపుతప్పిన ధాన్యం లోడు లారీ

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట వద్ద ధాన్యం తరలిస్తున్న లారీ ప్రమాదానికి గురైంది. మెదక్ ప్రాంతంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రంలో లోడు చేసుకొని రామాయంపేట రైసుమిల్లుకు వస్తున్న లారీ ప్రమాదవశాత్తు అక్కన్నపేట వద్ద కాల్వలోకి దిగబడింది. ఒరిగి బస్తాలు కింద పడిపోయాయి. మరో లారీలో ధాన్యాన్ని రైసుమిల్లుకు తరలించారు.

టార్పాలిన్లకు భలే డిమాండ్

ధాన్యం ఆరబెట్టుకోవాలన్నా.. వర్షం నుంచి కాపాడుకోవాలన్నా అన్నదాతను ఆదుకొనేవి టార్పాలిన్లు. వరికోతలు ప్రారంభం కాగానే రైతులు టార్పాలిన్ల కోసం ఎదురు చూస్తారు. అయితే అధికారులు కూడా సబ్సిడీపై అందజేస్తుంటారు. కాని ప్రస్తుతం అధికారులు చేతులెత్తేశారు. రైతులు అద్దెకు తీసుకొని వినియోగించుకొంటున్నారు. దీంతో టార్పాలిన్లకు డిమాండ్ పెరిగింది.

ధాన్యం ఆరబోతకు అవసరం: రైతులు

- చేతులెత్తేసిన వ్యవసాయాధికారులు
- అద్దెకు తీసుకొంటున్న అన్నదాతలు
- అద్దెకిస్తూ ఉపాధి పొందుతున్న గుంటూరు వాసులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలో ఈ యాసంగి సీజన్‌లో సుమారు 12వేల ఎకరాలలో వరిసాగు చేశారు. దాదాపు అన్ని గ్రామాలలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఐకేపీ, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆధ్వర్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. రైతులు కొనుగోలు కేంద్రం ఆవరణలో ధాన్యం ఆరబోసుకోవడానికి టార్పాలిన్లు చాలా అవసరం. దీంతో రైతులు ఒక్కో టార్పాలిన్‌కు రోజుకు రూ.10 వరకు చెల్లిస్తూ అద్దెకు తీసుకొంటున్నారు.



టార్పాలిన్లు కుడుతున్న సాంబశివరావు

పక్క రాష్ట్ర వాసులు ఉపాధి

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన సుమారు వందకుపైగా కుటుంబాలు మెదక్ జిల్లా వ్యాప్తంగా టార్పాలిన్లు అద్దెకిస్తూ ఉపాధి పొందుతున్నాయి. సుమారు ప్రతిరోజు 300 నుంచి 600 వరకు టార్పాలిన్లు రైతులకు అద్దెకు ఇస్తున్నారు. ఒక్కో టార్పాలిన్‌కు రోజుకు రూ.10 చొప్పున వసూలు చేస్తున్నారు. ఆయా మండలాల్లో పండిన ధాన్యం ఆధారంగా టార్పాలిన్లకు డిమాండ్ ఉంటుందని వారు చెప్తున్నారు. ఈ సీజన్‌లో డిమాండ్ కొంత తగ్గిందని, ప్రస్తుతానికి రోజుకు సుమారు 50వరకు టార్పాలిన్లు అద్దెకిస్తున్నామని చెప్తున్నారు. తెలంగాణలో కోతల సీజన్ ముందుగా ప్రారంభమవుతుందని, ఇక్కడ సీజన్ పూర్తికాగానే కర్ణాటక, అనంతరం ఆంధ్రాలో సైతం టార్పాలిన్లు అద్దెకిస్తామని చెప్పారు. ఆ ప్రాంతాలలో ఒక్కో టార్పాలిన్‌కు రూ.20 అద్దె తీసుకుంటామని తెలిపారు.

సబ్సిడీ టార్పాలిన్లు లేవు..

వ్యవసాయ కార్యాలయంలో ఐదు సంవత్సరాలుగా సబ్సిడీపై ఇచ్చే టార్పాలిన్లు అందుబాటులో లేవని వ్యవసాయ అధికారులు తెలిపారు. దీంతో రైతులు టార్పాలిన్లను అద్దెకు తీసుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవడంతో ధాన్యాన్నిఆరబెట్టడానికి టార్పాలిన్ల చాలా అవసరం అని దీంతో కిరాయికి తీసుకోక తప్పడం లేదని రైతులు వాపోతున్నారు.

టార్పాలిన్లు అందజేయాలి



కొన్నేళ్లుగా సబ్సిడీ టార్పాలిన్లు అందుబాటులో లేవు. దీంతో ధాన్యం కొనుగోలు సమయంలో ఇబ్బందులకు గురవుతున్నాం. అధికారులు అందజేయక పోవడంతో టార్పాలిన్లు అద్దెకు తీసుకోవాల్సి వస్తోంది. దీంతో అధిక మొత్తంలో అద్దె చెల్లించి ఇబ్బందులు పడుతున్నాం.

– గొట్టం గోవిందు, రైతు, చిలప్‌చెడ్

ప్రతియేటా ఇక్కడే..



చిలప్‌చెడ్ మండలం చండూర్ లోనే టార్పాలిన్లు అద్దెకిస్తాం. గత సీజన్లో ఇదే ప్రాంతంలో మంచి ఉపాధి పొందాం. ఈ యాసంగి సీజన్‌లో ధాన్యం దిగుబడి తగ్గడంతో టార్పాలిన్లకు డిమాండ్ తగ్గింది. ఇక్కడ సీజన్ ముగియగానే వేరే ప్రాంతాలకు వెళ్తాం.

– సాంబశివరావు, టార్పాలిన్ల నిర్వాహకుడు

దళారులను నమ్మి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకట్రామ్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): రైతులు తాము పండించిన ధాన్యంను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని శివ్వంపేట పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండలంలోని పోతారం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సన్నరకం బియ్యానికి అదనంగా రూ.500 చెల్లించనున్నట్లు తెలిపారు. వీరి వెంట పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పుట్ట మహేందర్, మల్లారెడ్డి, కుమార్, భూపాల్‌రెడ్డి, రాకేశ్ గౌడ్, సీఈఓ మధు, సురేశ్, కిరణ్‌కుమార్, గిరీష్, తదితరులులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం

శివ్వంపేట(నర్సాపూర్): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్రామిరెడ్డి అన్నారు. సీఏసీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం శివ్వంపేట, దొంతి, గంగాయిపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి లబ్ధి పొందాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు అవసరం ఉన్న చోట్లల్లో కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్మీకాంతారావు, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీనర్సయ్య, పీఏసీఎస్ సీఈఓ మధు, పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

కాదులూరులో కొనుగోలు కేంద్రం ప్రారంభం

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలం కాదులూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నిమ్మరమేశ్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈఓ లక్ష్మీ, ప్యాక్స్ డైరెక్టర్స్ శ్రీరాములు, పాపయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, నాయకులు రాములు, అంజయ్య, యాదయ్య, మురారి, సత్తయ్య, మల్లేశం, అంజగౌడ్ , దుర్గాగౌడ్, రాములు గౌడ్, అశోక్ చారి తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసమే కొనుగోలు కేంద్రం



శేరిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): రైతులకు సౌకర్యం కల్పించేందుకే అదనంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మడూర్ పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మల్లేశం, రమేశ్, సీఓ కృష్ణా, నాయకులు గోవర్ధన్, గౌండస్వామి, శ్రీనివాస్, లక్ష్మీనర్సింహులు, రమేశ్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రం సందర్శన

రామాయంపేట(మెదక్): మండలంలోని దామరచెరువు గ్రామంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం స్థానిక తహసీల్దార్ రజనీకుమారి సందర్శించారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా కొనుగోళ్లు నిర్వహించాలని ఆమె సూచించారు. వర్షం కురిసే అవకాశం ఉండటంతో కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని వెంటనే రైసుమిల్లులకు తరలించాలని ఆమె సూచించారు. అనంతరం తహసీల్దార్ బాలాజీ రైసుమిల్లును సందర్శించారు.

ఉచిత వాలీబాల్ శిక్షణ

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారంలో వేసవిలో ఉచిత వాలీబాల్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు క్రీడాకారుడు మైపాల్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి 31 వరకు నిర్వహించే శిబిరంలో 14 ఏళ్లు నిండిన వారు వినియోగించుకోవాలని కోరారు. శిబిరాన్ని జిల్లా క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

కబ్జాకు పాల్పడితే చర్యలు

కౌడిపల్లి(నర్సాపూర్): కుంట శిఖం కబ్జాకు పాల్పడితే చర్యలు తప్పవని ఐబీ డిప్యూటీ ఈఈ జగన్నాథం హెచ్చరించారు. మంగళవారం తిమ్మాపూర్‌లో ఎల్లమ్మ కుంటను స్థానిక రైతులు చదును చేసి కబ్జాకు పాల్పడుతుండంతో డిప్యూటీఈఈ జగన్నాథం, ఏఈ రవిమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ ఎల్లమ్మకుంటలో 4ఎకరాల శిఖం, 6ఎకరాల ఆయకట్టు ఉందని చెప్పారు. గ్రామానికి చెందిన రైతులు పిల్లి మల్లేశం తదితరులు జేసీబీతో చదును చేస్తుండగా అడ్డుకున్నట్లు తెలిపారు. ఎల్లమ్మకుంట శిఖం, ఆయకట్టు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. చెరువు కంటలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు.



ఎల్లమ్మకుంట శిఖంలో చదును చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో సీసీ రోడ్ల పనులను బీజేపీ నాయకులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నాగభూషణం మాట్లాడుతూ...ఎంపీ రఘునందన్‌రావు చొరవతో రూ.10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు గ్రామ సీసీ రోడ్ల నిర్మాణం కోసం మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు స్వామి, రమేశ్, వంశీకృష్ణ, మహిళ మోర్చ నాయకురాలు పద్మ, సత్తయ్య, భాను తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

ఈఎస్ఐకి నూతన భవనం పరిశీలన



ఈఎస్ఐ నిర్వహణ కోసం నూతన భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

తూప్రాన్: పట్టణంలోని పోతరాజుపల్లిలో కొనసాగుతున్న ఈఎస్ఐ డిస్పెన్సరీ కోసం నూతన భవనాన్ని నానాఆర్డీఓ జయచంద్రారెడ్డి మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం డిస్పెన్సరీ పోతరాజుపల్లిలో అద్దె భవనంలో కొనసాగుతోంది. ప్రభుత్వం నుంచి ప్రతి నెల అద్దె డబ్బులు చెల్లించని కారణంగా భవన యాజమాని డిస్పెన్సరీ గదికి తాళం వేశారు. ఈ విధంగా పలుమార్లు చోటు చేసుకుంది. శాశ్వత భవనం లేని కారణంగా అద్దె భవనాల్లో కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని డిస్పెన్సరీ నిర్వహణ కోసం మరో భవనంను ఆయన పరిశీలించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే ఈఎస్ఐ వైద్య సదుపాయం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆర్డీఓ వెంట ఈఎస్ఐ వైద్య సిబ్బంది ఉన్నారు.

అంగన్వాడీ టీచర్ల ముందస్తు అరెస్ట్



పాపన్నపేట(మెదక్): అంగన్‌వాడీ టీచర్లను ముందస్తు అరెస్ట్ చేసిన దృశ్యం



నిజాంపేట(మెదక్): పోలీస్ స్టేషన్‌లో అంగన్వాడీ టీచర్లు

పాపన్నపేట(మెదక్): ములుగు జిల్లాలో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి తరలి వెళ్లకుండా మంగళవారం అంగన్‌వాడీ టీచర్లను పాపన్నపేట పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సంధర్భంగా అంగన్‌వాడీ టీచర్లు అనూరాధ, బసమ్మ, యాదవేణి, లలిత, శోభారాణి, పారుబాయి మాట్లాడుతూ తమ వేతనాలను పెంచాలని, ,న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు.

నిజాంపేట(మెదక్): స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రికి మోమొరాండం ఇవ్వడానికి పిలుపునిచ్చిన సీఐటీయూ నాయకులకు మద్దతు తెలిపిన అంగన్వాడీ టీచర్లను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ టీచర్లకు అంగన్వాడీ టీచర్ల మాదిరిగానే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే అందరి విద్యార్థుల మాదిరిగానే అంగన్వాడీ విద్యార్థులకు మే నెలలో వేసవి సెలవులు మంజూరు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన అంగన్వాడీ టీచర్ల జీతాలు రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ రేణుక, అరుణ శ్రీ, మణెమ్మ, దుర్గేశ్వరి, రామలక్ష్మి, వీణ పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది.. గ్రామ పంచాయతీ పాలన ముగిసినప్పటి నుంచి ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి గ్రామాలు కంపుకొడుతున్నాయి. మురికి కాల్వలు నిండిపోయి రోడ్లపై మురుగు నీరు పారుతోంది. దీంతో ఈగలు, దోమల వీరవిహారం చేస్తున్నాయి. ప్రజలు అనారోగ్యం బారిన పడి ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కంపు కొడుతున్న నత్నాయిపల్లి

- ఈగలు, దోమల స్వైర విహారం
- అపరిశుభ్రంగా తాగునీటి ట్యాంక్‌లు

నర్సాపూర్ రూరల్: పారిశుద్ధ్య లోపంతో మండలంలోని నత్నాయిపల్లి కొన్ని రోజులుగా కంపు కొడుతోంది. మురికి కాల్వల నిర్వహణ, అంతర్గత రోడ్లు శుభ్రం చేయకపోవడంతో మురికినీరు రోడ్లపై పారుతుంది. ఎక్కడ చెత్త అక్కడే ఉంటుంది. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. గ్రామంలోని మిషన్ భగీరథ ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం చేరి తాగునీరు కలుషితమవుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పరిరక్షణ కోసం దాతల సహకారంతో లక్షలు ఖర్చుపెట్టి 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా.. నిర్వహణ లేకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. పంచాయతీ పాలకవర్గం బాధ్యతల సమయం ముగిసినప్పటీ నుంచి గ్రామ పరిపాలన అస్తవ్యస్తంగా తయారైందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నత్నాయిపల్లి పంచాయతీ పరిధిలోని వడ్డెర కాలనీకి సరఫరా అయ్యే మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు సంబంధించిన వాల్స్‌ను మిషన్ భగీరథ సిబ్బంది ఇతర ప్రదేశాలకు తరలించడంతో ఆ కాలనీకి తాగునీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై పలుమార్లు గ్రామ కార్యదర్శికి విన్నవించినా నిధుల లేమి కారణం చూపుతూ సమస్యలు పరిష్కరించడం లేదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీఓ వైద్య శ్రీనివాస్‌ను వివరణ కోరగా పారిశుద్ధ్య కార్మికుల పనులకు రాకపోవడంతో ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమేనన్నారు. నిధులు లేకపోవడం కూడా నిజమేనని తెలిపారు.



ప్రధాన కూడలిలో పేరుకుపోయిన చెత్త



నత్నాయిపల్లిలో రోడ్డుపై పారుతున్న మురికినీరు

సంక్షిప్త వార్తలు

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు ఆర్థికంగా మేలు జరుగుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో నర్సాపూర్, శివ్వంపేట, కొల్చారం మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందచేశారు.

◆ 5న పాత వాహనాల సామగ్రి వేలం

మెదక్ మున్సిపాలిటీ: వచ్చేనెల 5న జిల్లా పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని పోలీస్ పాత వాహనాల సామగ్రిని వేలం వేయనున్నట్లు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ వాహనాలకు ఉపయోగించిన విడిభాగాలు, టైర్స్ , బ్యాటరీలకు.. మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన గల పాత ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో మే 5వ తేదీన ఉదయం 10 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు పాల్గొనాలని సూచించారు. సమాచారం కోసం 87126 57912 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

◆ ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

కౌడిపల్లి(నర్సాపూర్): ఇందిరమ్మ ఇళ్లను మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాస్ పరిశీలించారు. మండలంలోని శేరితండా, కంచన్‌పల్లి, పీర్యతండా, దేవులపల్లి, కొడిపల్లి, కొట్టాల గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిరుపేదలైన అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

లబ్ధిదారులపై విచారణ

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎంపికైన లబ్ధిదారులను విచారణచేశామని ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి తెలిపారు. మండల పరిధిలోని బండపోతుగల్, గుజిరితండా, బద్ర్యా తండాలలో లబ్ధిదారుల వివరాలను మంగళవారం ఆయన సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు మొదటి విడతగా ప్రభుత్వం నిరుపేదలకు అవకాశం ఇచ్చిందన్నారు. గ్రామసభలో ఏర్పాటు చేసిన జాబితాలో ఇదివరకే పేర్లున్నప్పటికీ, ఆ లబ్ధిదారులకు కారు, అర్హతకు మించి భూములు, ఇతర ఆస్తులు ఉన్న వారి పేరు రద్దు చేస్తామని తెలిపారు. లబ్ధిదారుల వివరాలు సేకరించి వచ్చే నెల 2 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. అనంతరం అసలైన అర్హులను ఉన్నతాధికారులు గుర్తిస్తారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నంద్, శిల్ప, మోహన్‌లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికపై ఆరా

నర్సాపూర్ రూరల్: ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారుల వివరాలను నర్సాపూర్ ఎంపీడీఓ మధులత మంగళవారం సిబ్బందితో కలిసి ఆరా తీశారు. ఉన్నతాధికారుల ఆదేశాలకు మండలంలోని అవంచ, రుస్తుంపేట, ఎరక్రుంట తండా, ఎల్లారెడ్డి గూడ తండా తో పాటు ఆయా గ్రామాలలో ఎంపికైన 314 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను ఆరా తీసి ధ్రువీకరిస్తున్నట్లు తెలిపారు.

◆ ఎల్లమ్మ జాతర ఉత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన ఎల్లమ్మ జాతర ఉత్సవాలు కనుల పండువగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఎల్లమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.

◆ మేడేను విజయవంతం చేయాలి

మనోహరాబాద్(తూప్రాన్): అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను కార్మిక సోదరులు విజయవంతం చేయాలని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ పిలుపునిచ్చారు. మనోహరాబాద్ మండల కేంద్రంలో మండల పంచాయతీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ కార్మికుడు విధిగా జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నాలన్నారు. సమావేశంలో మండల పంచాయతీ కార్మికుల ఉపాధ్యక్షుడు స్వామి, కాళ్లకల్ గ్రామ అధ్యక్షుడు వీరేశ్, రాములు, నర్సింలు, కృష్ణ, సుశీల, శాంతమ్మ, ఆగమయ్య తదితరులు పాల్గొన్నారు.